# జాతి కుక్క

రంగారావు విస్కీ పుచ్చుకున్నాడు. గొంతులో మంటగా ఉన్నా, కడుపులో వేడిలేస్తున్నా ఒళ్ళు మాత్రం కులాసాగా ఉంది. బరువుగా నడిచి వెళ్ళి కిటికీ సర్రున లాగి బైటకి చూశాడు. మధ్యాహ్నం మూడు గంటలే అయినా చీకటిగా ఉంది. చలిగా ఉంది. తేమగాలి రంయ్ రంయ్ మని వీస్తోంది. ఆకాశం మీద నల్లటి నీటి మేఘాలు చిక్కగా అల్లుకుంటూ గుడగుడ మంటున్నాయి. గాలి వాన వచ్చే వాతావరణం. ఉండుండి చిన్న జల్లు కొట్టి ఆగిపోతోంది. గాలి మాత్రం ఉధృతంగా ఉంది. గాలి ధాటీకి తాటిచెట్లు పిరికిగా ఊగిసలాడుతున్నాయి. వీక్షణాన్నయినా ఫళుక్కున విరిగిన దభాలున నేలకి కూలిపోయేటట్టుగా వున్నాయి.

బీచి రోడ్డు నిర్మానుష్యంగా ఉంది. సముద్రం అల్లకల్లోలంగా ఉంది. అలలు ఉవ్వెత్తుగా లేచి విరిగి పడుతున్నాయి.

రంగారావు మత్తు కళ్ళతో బయట వాతావరణాన్ని చూస్తున్నాడు. రోడ్డుమీద కుష్టురోగి కుంటుకుంటూ తిరిగి జల్లు కొట్టేలోపుగా ఎక్కడైనా తలదాచుకోడానికి పరుగెత్తుతున్నాడు. రోడ్డు పొడవునా మేడలు, భవంతులు వాటిక్రింద తలదాచుకోడానికి దరిద్రులకు, అన్నార్తులకు అర్హత లేదు. కుష్టురోగి భవంతులకు మధ్యగా ఉన్న పూరి గుడిసెల వైపు పరుగెత్తాడు. కనీసం ఎక్కడైనా కూలిపోయిన పూరి గుడిసె పంచలో తలదాచుకోడానికి.

భవంతుల మధ్యలో పూరి గుడిసెలు ఉండటం అసహ్యమనిపించింది రంగారావుకి. ఆగాలిలో, ముసురులో తడిసి ముద్దయిపోయి వణుకుతున్న రోగిష్ఠి ముష్టివాళ్ళలా ఉన్నాయి ఆపాకలు. వచ్చటి మేడల వైపు దీనంగా చూస్తున్నాయి. ఈపాడు గుడిసెలు మూలాన వీధి డీసెన్సీ పోయిందని బాధపడ్డాడు. గాలి హెచ్చయి వాటిని ఎగరగొట్టేస్తే బాగుండుననిపించింది. ఆపాకల్ని ఇంకా పీకించెయ్యనందుకు మునిసిపాలిటీ వాళ్ళమీద కోపంకూడా వచ్చింది.

ఎక్కడో కుక్క "బౌ బౌ" మంది. రంగారావు అటువైపు చూశాడు బీచిలో కుక్క దేనితోనో చెలగాటలాడుతోంది. అది ఊర కుక్క దాన్ని చూడగానే రంగారావుకి ఒళ్ళు మండింది. అసహ్యంగా ముఖం చిట్లించుకుంటూ సర్రునలేచి కర్టను మూసేసి పెళ్ళాన్ని కేకేశాడు.

"ఏమిటండీ!"

"రాజా ఎక్కడ?"

"ఇంకా ఇంట్లోనే ఉన్నాడనుకుంటున్నారా రెండు గంటలకే కుక్కతో బీచికి షికారెళ్ళాడు" అంటూ చలికి పైటనిండా కప్పుకుంటూ ఎదురుగా కుర్చీలో కూర్చుంది.

"నీకు మతీ గతీ ఉందా లేదా? ఈరొజ్జగాలిలో బీచికి వెళ్తుంటే చూస్తూ ఊరుకున్నావా?"

"అయ్యో! నేనేం చెయ్యనండి. చెప్పి చెప్పి నా నోరు పడిపోయింది. ఇప్పుడే వచ్చేస్తానని కుక్కతో బీచికి పరుగెత్తాడు."

"పరుగెత్తుతాడు! పరుగెత్తుతాడు. ముద్దు చేస్తే నెత్తినెక్కి కూర్చుంటున్నాడు. వీడికి ఆ కుక్క ఒకటి దొరికింది. చూసి చూసి దాన్నొకరోజు కాల్చి పారేస్తాను. పీడా విరగడైపోతుంది. దాన్ని

పట్టుకొని వీడికి చదువూ, సంధ్యా తిండీ తిప్పల మీద కూడా ధ్యాస లేకుండాపోతోంది" అని చిందులు తొక్కుతూ గదిలో పచారు చెయ్యడం మొదలెట్టాడు.

"పోనిద్దురూ-మీరు మరిన్నూ చిన్నవాడు. కొన్నాళ్ళుపోతే వాడే మానేస్తాడు వాడికి ఆ కుక్కంటే ఎంత ఇష్టమో!"

"అదే ఒద్దంటున్నాను. ఇరవైనాలుగు గంటలూ ఆ పాడు కుక్కేనా?....అసలు నిన్ను అనాలి. నిన్నూ .. దాన్ని వాడు ఏ పెంటమీది నుంచి తెచ్చినప్పుడే అన్నాను. అది ఊర కుక్క. దాన్నెక్కడైనా ఒదిలయ్యించమని......విన్నావూ?....."పోనీ, చిన్నవాడు,చిట్టివాడు,చంటివాడు కుక్కపిల్లతో ఆడుకుంటున్నాడని" ముద్దుచేశావు ఇప్పుడు అనుభవించు దాన్ని విడిచిపెట్టటంలేదు... మంచి కుక్కయితే పోనీ ఫరవాలేదు....పాడు ఊర కుక్క. చెవులు నిక్కపొడుచుకుంటూ అసహ్యంగా ఛీ! ఛీ! మొన్న తల తీసేసినంత పనిఅయింది" అంటూసోఫాలో చిరాగ్గాకూర్చొని ఎదటి స్టూలు మీద సిగరెట్టుపెట్టి తీసి సిగరెట్టు నోట్లోపెట్టుకొని అగ్గిపెట్టె కొట్టాడు. వెలగలేదు. పుల్లని విరిచిపారేసి మరో పుల్ల కొట్టాడు. చిరాకుతో వెనక్కి తిప్పి కొట్టాడు. ఎలా వెలుగుతుంది?...."ఛీ! ఛీ! అంటూ నేలకేసి కొట్టాడు. అగ్గిపెట్టెమీద చిరాకు చూపిస్తున్నా అది ఇండైరెక్టుగా తన కొడుకు మీద అసహ్యమనిన్నీ, అంతకంటే తన కొడుకు పెంచుతున్న కుక్కమీద కోపం అనిన్నీ సరోజ గమనించింది.

"ఏంజరిగిందండీ! ఎందుకలా చించుకు పోతున్నారూ?"

"ఏంజరిగిందా? చెప్తాను విను నీ సుపుత్రుడి సంగతి మొన్న క్లబ్బు ప్రెసిడెంటుగారింట్లో పార్టీ జరుగుతుంటే వీడూ వచ్చాడు. వీడొక్కడేనా? తగుదునమ్మా అని కుక్కని వెంట

తీసుకొని మరీ వచ్చాడు. ప్రెసిడెంటుగారు వీడిని వీడి కుక్కని చూసి ముసి ముసి నవ్వులు నవ్వుతూ, ఒక బిస్కతు ముక్క కుక్క మీదికి విసురుతూ ఏంటోయ్! ఎక్కడనుంచి తెచ్చావ్ ఈసీమకుక్కని అన్నారు. ఎంత హేళనగా ఉన్నాయనుకున్నావ్ ఆముసి ముసి నవ్వులు. దానికితోడు మిసెస్ రాజారావు కూడా తన ఒళ్ళో బొచ్చుకుక్కని నిమురుతూ ప్రెసిడెంటుగారి విట్టు మీద ఒక్కటే నవ్వు... ఛీ! ఛీ! నాకెంత నామోషి అనిపించిందో తెలుసా. అంతటితో అయిపోయిందా. ప్రసిడెంటుగారి మాటలకి మన వాడికి......వేలాడంతలేదు......ఎక్కడలేని పౌరుషం వచ్చేసింది. సర్రున లేచి తింటున్న బిస్కట్టు ముక్కని కుక్క నోట్లోంచి లాగి అవతల పారేసి బలవంతాన కుక్కని బరబర లాక్కుపోయాడు.... ఇది చూసి మరీ నవ్వటం మొదలెట్టారు అక్కడున్న వాళ్ళందరూ. నవ్వుతున్న ప్రెసిడెంటుగారు హఠాత్తుగా ఆగి పెదాలమీద చిరునవ్వు అంటించుకొని ప్రక్కనున్న నాభుజం తడుతూ "రంగారావ్! మీవోడు ఎమోషనల్ టైప్‌వోయ్" అన్నారు నవ్వుతూ మనవాడు పార్టీనుంచి విసురుగా వెళ్ళిపోవటం అతను ఇన్సల్టింగ్‌గా ఫీలయినట్టుంది....ఆ పార్టీ అవుతున్నంతసేపూ నేను సిగ్గుతో అతనితో సరిగ్గా మాట్లాడలేకపోయాను. అదీ మనవాడి ఘనకార్యం."

"అందుకే గావాలండీ మొన్న సాయంకాలం వాడి మొహం వాడిపోయింది. చాలా చిరాగ్గా గొణుక్కుంటున్నాడు. బుద్ధి తక్కువే. గతిలేక వాడి పార్టీకి వెళ్ళా. ఇష్టం వచ్చినలాగా మాట్లాడుతున్నాడు. వాడి దగ్గర పెద్దకుక్క ఉందని టెక్కు ఎవడిక్కావాలి.

వాడి బాబుల్లాంటి బిస్కత్తులు, కేకులూకొని పెడ్తాను" అంటూ కుక్కని నిమురుతూ మిల్కు బ్రెడ్ తినిపించాడండీ"

"అదికాదు సరోజం. నువ్వు వాడిని కాస్త భయంలో పెట్టాలి. మనది ఇంతో అంతో గొప్ప కుటుంబం కదా! డీసెన్సీ ఉండాలంటావా? ఊరి కుక్కలతోనా వీడికి సావాసం. మనం పెంచిన వాటికీ మనం ప్రేమించినవాటికీ మనలాంటి అంతస్తే ఉండాలికదా. నేను కూడా అనాధశరణాలయంలో నాపేరున ఇద్దరు తిండిలేని కుర్రాళ్ళకి డబ్బిచ్చి పోషిస్తున్నాను. అంత మాత్రాన వాళ్ళని వేనకేసుకొని నాతో క్లబ్బులకీ, కార్లలోనూ తిప్ప గలనా....కావలిస్తే అల్సేషియన్, బుల్‌టెరియర్ లాంటి కుక్కలని కొనిపెడతాను, ఈఊర కుక్కని విడిచిపెట్టెయ్యమన్నాను. వింటేనా! అదే కావాలంటాడు, పోనీ నాలుగు తందామంటే చేతులురావు.... ఎలాగ?"

"పోన్లెద్దురూ! మీరు మరిన్నూ వాడేకొన్నాళ్లు పోతే మానేస్తాడు. మీరు మాత్రం చిన్నప్పుడు రోజుకొక కుక్క పిల్లని తెచ్చేవాడ్నని చెప్పలేదేంటీ! మీలాగే వాడున్నూ బాబు పోలిక.

"అయితే మాత్రం, నేను తెచ్చినవి ఇలాంటి కంతిరీకుక్కలా? బ్లడ్ హవుండ్, పెకినీస్....డాష్...."

"ఏదైనా కుక్క కుక్కేకదా! పాపం వాడికి జాకీ అంటే పంచప్రాణాలు. దానికికూడా వాడంటే ఎంతఇదో వాడుబడి నుండి వచ్చేదాకా గుమ్మంలో వాడికోసం కాచుకు కూర్చుంటుంది. వాడు చేత్తో ఇచ్చేదాకా పంచభక్ష్య పరమాన్నాలైనా ముట్టదు. వాడు రోజూ ఈమధ్య దానికి బిస్కట్లుకొని మేపుతున్నాడండోయ్." అది చాలా తెలివిగలదనిన్నీ, శనివారం నీచు ముట్టదనీ, మిగతా ఊరకుక్క

లాంటిది కాదనిన్నీ" మన వంట మనిషితో అప్పుడప్పుడు లెక్చర్లు ఇస్తుంటాడట. అది ఇవన్నీ నాతో చెబుతూ ఒకటే నవ్వు" అంటూ సరోజం కూడా కొడుకుని తలుచుకుంటూ మురిసిపోతూ నవ్వడం మొదలెట్టింది. రంగారావుకి మెడమీద గుప్పెడు గొంగళి పురుగులు పాకుతున్నట్టయింది.

"చాల్లే కొడుకు ప్రయోజకత్వానికి మురిసిపోతున్నావు. ఇదంతా నువ్విచ్చిన అలుసే....... నాకు రిమ్మెత్తిందంటే దాన్ని కాల్చి పారేస్తాను. పీడా విరగడైపోతుంది"

ఇది విన్న సరోజం నవ్వుతున్నదల్లా హఠాత్తుగా ఆగిపోయి "మీకు పుణ్యముంటుంది. అలాంటి పనులేవీ చెయ్యగలరు. అసలే వాడు పట్టుదల గలవాడు. గొడవచేసి పారేస్తాడు....మొన్న ఎంత హంగామ చేశాడనుకున్నారూ-మీరు హైదరాబాదు వెళ్ళిన రోజున.. మళ్లీ వాడిని ఏమైనా అనగలరు. నా మీద ఒట్టు చెప్పకూడదనే అనుకున్నాను. నా పాడునోరు జారిపోయింది...."

"ఏమిటో సుపుత్రుడి ఘనకార్యం....చెప్పనట్టు ఒట్లూ, సత్యాలూ దేనికి?"

"ఆ రోజు రాజా ఇంకా బడినుంచిరాలేదు. జాకీ కట్టు విడిపోయి వీధిలో తిరుగుతుంటే ఇదేదో బేవార్సు కుక్కని ముసిసి పాలిటీ కుక్కల బండివాడు దాన్ని ఉరేసి బండిలో పడేసుకొని తీసుకుపోయాడు. బడి నుంచి వస్తున్న మనవాడికి కుక్కలబండి ఎదురైంది. తమాషాచూద్దామని బండిలోకి తొంగి చూశాడట. ఇంకేముంది. ఒక్కసారి కొండ విరిగి మీద పడినంత పనయింది. కుక్కల మధ్యలో నిస్సహయంగా, బిత్తరచూపుల్తో జాకీ రాజాని చూసి కుయ్‌మని ఏడవటం మొదలెట్టింది....చిందులుతొక్కుతూ

పుస్తకాలసంచీ రోడ్డుమీద పారేసి బండికి అడ్డంగా వెళ్ళి దాన్ని ఆపుచేస్తూ, బండివాడిని నోటి కొచ్చినట్లు తిడుతూ "నా కుక్కని ఒదిలేస్తావా లేదా" అంటూ చేతి కందిన రాళ్ళతో బండిమీద ధన్ ధన్ మనికొట్టడం మొదలెట్టాడట. జనం మూగిపోయారు. దాంట్లో తెలిసిన వాళ్లెవరో రాజా మన అబ్బాయి దేవనినీన్ని. ఆకుక్క మనదేవనినీన్ని చెబితే అప్పటికే సగంహడలి చచ్చిపోయిన బండి వాడు కుక్కనీ, రాజానీ దండాలు పెడుతూ "అగ్గిబరాటా లాంటి కుఱ్ఱాడు బాబోయ్" అంటూ కుక్కని ఒపెలేశాడట. ఇంటికి వచ్చే టప్పుడు వాడి వాలకం చూస్తే నాకే భయం వేసింది... కళ్ళు చింత గింజల్లా ఉన్నాయి....ఒళ్ళంతా చెముటతో తడిసిపోయి రోడ్డు ధూళితో ఎఱ్ఱగా ఉంది. "అమ్మా! లంజకొడుకు మరి కాస్త ఆలస్యం చేసుంటే నాన్నగారి రివాల్వం తీసికెళ్ళి షూట్‌చేసి జాకీని విడిపించేసుందును" అంటూ పెదాలమీద జారుతున్న చెమటని మోచేత్తో తుడుచుకుంటుంటే నాకు చెడ్డ భయం వేసింది సుమండీ".

ఇది వినేసరికి రంగారావుకి కూడా చిరుచెమట్లెక్కాయి.

"ఊహూ! నా రివాల్వరు తీయాలని కూడా కోరిక గలిగిందీ....ఇంత వరకూ వచ్చిందీ వ్యవహారం....ఊ....ఎలాగః" అని కళ్ళు మూసికొని సోఫాలో సాలోచనగా జారగిలబడ్డాడు.

బయట గాలి రయ్ రయ్ మని తెరలు తెరలుగా వీస్తోంది.

* * *

సముద్రం ఘోష పెడుతోంది. కెరటాలు తీరాన నల్లటి గుట్టల్ని ఢీకుంటూ నురగలు గ్రక్కుతూ ఎగిరిపడుతున్నాయి. చలి బీచిలో ఒణికి చేస్తోంది.

రాజా ఒడ్డున ఇసుకలో నడుస్తున్నాడు. సూదిముక్కు బూట్లు తడి ఇసకలో కసుక్కు కసుక్కు మంటున్నాయి. ఉండుండి ఆగి గాలికి ముఖం చిట్లించుకుంటూ చుట్టుప్రక్కల చూస్తున్నాడు నల్లటి ఆకాశం, నల్లటి మబ్బులు, నల్లటి కొండరాళ్ళు. కెరటాల తెల్లటి నురగలు, దూరంగా మసగ్గా కనిపించే కొండలు, సూదుల్లా పొడుస్తున్న చలి గాలి.... భేష్! బాగుందనుకున్నాడు. నిర్జనంగా ఉంది.... తనూ, తన జాకీ. జాకీ రాజా వెంట నడుస్తోంది. జాకీ ఒక్కగా ఉంది. చెవులు అందవికారంగా ఒకటి నిక్కబొడుచుకొని మరొకటి సగంవాలి ఉన్నాయి. ఎండిపోయిన తెలగపిండిలాంటి అసహ్యమైన రంగు. గుండెమీద చెదరిపోయిన తెల్లటి మచ్చ. అసలు సిసలైన కల్తీలేని ఊరకుక్క.

రాజాకి ఏదో "కౌబోయ్" ఇంగ్లీషు సినిమా జ్ఞాపకం వచ్చింది. ఆ హీరోకి కూడా తనకిలాగే కుక్క ఉండి రెండు జేబుల్లో పిస్తోళ్ళున్నాయి. కేవలం కుక్క సహాయంతో దొంగల ముఠాని తరిమి తరిమి కొట్టాడు.... గొప్ప సీను.... థ్రిల్లింగ్....ఎడ్వెంచర్ కమాన్ జాకీ.... జాకీ! దూరంగా నత్తగుల్లల్ని వాసన చూస్తున్న జాకీ ఉరకలేసుకుంటూ వస్తోంది. దాని అడుగుల జాడలు తడి ఇసుకలో తీర్చి దిద్దినట్లు కనిపిస్తున్నాయి. హుర్రే... సర్! సర్! విషిల్సు....కమాన్.... భౌభౌ ..

"రాళ్ళబండల వెనకాల దొంగలు పొంచి ఉన్నారు...... హుర్!.. జాగ్రత్త!.!. ప్చ్. డోన్ట్ కేర్...అమాంతంగా ఏడడుగులు పెరిగిపోయాడు. ఎర్రటి కందగడ్డ లాంటి జిడ్డు కారుతున్న దొరమొహం....పిల్లి కళ్ళు, ఇనపకొక్కాల బూట్లు.... జేగురు రంగు జుత్తు. హిప్ పాకెట్స్‌లో రివాల్వర్లు, టోపీ సర్దుకుంటూ నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకొంటూ నడుస్తున్నాడు. ..

డం.. డం...డం....భయంకరమైన ఇంగ్లీషు మ్యూజిక్కు. బోఁయ్! బోఁయ్....లంగరు వేసిన స్టీమరు అరుస్తోంది సముద్రం మధ్యలో. రాళ్ళ వెనకాల నుంచి ఒక చెయ్యి లేచింది....క్లిక్! క్లిక్ చేతిలో ఆరుగుళ్ళ పిస్తోలు....మన హీరో వైపు తిరుగుతోంది ... బౌ బౌ బౌ జాకీ! ఢామిట్. కీప్ క్వయిట్...చెయ్యిగురికోసం వెతుకుతోంది.... హీరో నవ్వుకున్నాడు. పెదాలు తడుపుతున్నాడు. జేబులో నించి సిగరెట్టు...అగ్గిపెట్టె...లేదు...బేక్ పోకెట్టు అంతే! టిష్యూ...టిష్యూ....టిష్యూ హిప్ పోకెట్ లోనించి తీసిన రివాల్వర్లు నిప్పులు కక్కుతున్నాయి....టిష్యూ....టిష్యూ.... టిష్యూ....దొంగలు రాయి వెనకాల్నించి కాలుస్తున్నారు....పట్టీలు.... మొగ్గలు....దొర్లడం···· టిష్యూ.... టిష్యూ....టిష్యూ .. టిష్యూ... టిష్యూ....కాలుస్తునే గుళ్ళవర్షంనుంచి తప్పించుకొంటూ మొసలిలా పాకురుకుంటూ పడవ ప్రక్కన నక్కిపోయాడు.... ఉండండి టిష్యూ... దొంగలు టిష్యూ....ఇసక రేగిపోతోంది బౌ బౌ బౌ... ష్! నోరు నొక్కి జాకీని ఒళ్ళోకి లాక్కొన్నాడు....నిశ్శబ్దం.... అంతా నిశ్శబ్దం....హీరో ఎక్కడున్నాడో దొంగలికి తెలియటంలేదు.... మందుగుండు వాసన...నిశ్శబ్దం..ట్లాట్...ట్లాట్...ట్లాట్...ట్లాట్... వాట్? గుర్రాలు ..ట్లాట్...ట్లాట్... డెక్కల చప్పుడు...మైగాడ్! అదనపు దొంగల గుంపుగుర్రాల మీది వస్తున్నారు..దగ్గరౌతోంది.. ట్లాట్,ట్లాట్ ..ట్లాట్...ఛెళ్ .ఛెళ్...కంచీ దెబ్బలు...హి హ్హి హ్హి. గుర్రాల సకిలింపులు..టక్. .టక్..,టక్..,గాలించేస్తున్నారు అబ్బ! కుక్క తోక తొక్కేసుందురో, వేరీజ్ దిడెవిల్? తాగినవాడివా అడిగాడు...సమ్ వేర్ హియర్‌కు బాస్..సెర్చ్...ఒక దున్నపోతు కొండ రాయిమీద నిల్చొని ఎడమచేత్తో పొట్టరాసుకుంటూ చీపి

కళ్ళతో వెతుకుతున్నాడు. కుడిచేతిలో పెద్ద తుపాకీ...హీరో... కనిపించడంలేదు .. కసికొద్దీ గుర్రాల్ని ఛెళ్ళు ఛెళ్ళుమని బాదేస్తూ దౌడాయిస్తున్నారు—గుర్రాల డెక్కల క్రింద ఎర్రటి ధూళి రేగుతోంది—రైట్—ఏక్షన్—సమయం చూశాడు.. పడవమీద రెండు పిస్తోళ్ళూ ఆనించాడు—ఓకే!—టిష్యూ కొండరాయిమీద దున్న పోతు దొర్లిపొయ్యాడు. సముద్రంలో పడి గిలగిల కొట్టుకుంటున్నాడు వాడి నెత్తుర్ని కెరటాలు ఒడ్డుకి చిమ్ముతున్నాయి—ఎక్కడ నుంచి ఈ దెబ్బల ఏజెంటు?—కనిపించటంలేదు— హడలి పోతున్నారు—స్కార్లెట్ పింపర్నల్—టిష్యూ టిష్యూ—టిష్యూ—ఒకరు. ఇద్దరు — ముగ్గురు గుర్రాల మీది నుంచి దొర్లి పోతున్నారు—టిష్యూ—హి హ్హి హ్హీ — —గుర్రం గుండెల్లోనించి దూసుకు పోయింది. గభీమని కూలిపోయి దబదబ తన్నుకుంటోంది. దానిక్రింద ఒకడు అప్పడంలా కసుక్కుమని అణిగిపోయాడు. వాడి నెత్తురు ఇసకలో ఇంకుతోంది. టిష్యూ మిస్ అయిపోయినది. మిగిలిన ఒక్కడూ "మైగాడ్! టఫ్‌గై" అంటూ అదే దౌడు. తుపాకీ కాల్పులకి జడిసిపోయి గుర్రాలు తోక లెత్తుకుంటూ వెర్రిగా సకిలిస్తూ గజిబిజిగా పరుగెత్తుతున్నాయి. వాటిని జాకీ బౌ బౌ మని వెంట తరుముతోంది చచ్చిన దొంగల శవాల్ని కసితీరా కొరికేస్తోంది. హీరో పడవ ప్రక్కనుంచి లేచి పిస్తోళ్ళు జేబులో పెట్టుకుంటూ విజయగర్వంతో రణభూమిని కలయచూశాడు. చచ్చిన దొంగల శవాలు—ఇంకా ప్రాణంతొ తన్నుకుంటున్న గుర్రం నెత్తురు—బ్లడ్—విజయం—తనూ తన కుక్క జాకీ హీరో. కంగ్రాచ్యులేషన్స్ జాకీ—గొప్పసీను—థ్రిల్లింగ్—ఎడ్వంచర్—హుర్రే" పన్నెండేళ్ళు నిండిన రాజా ఆనందంతో రెచ్చిపోయి గెంతుతున్నాడు.

ఈ ఏక్షనంతా నిజమనుకొని జాకీ బౌ బౌ ఎంటూ పరుగు లెత్తుతోంది. రాజా నటనని చూసి నిజంగా తన యజమానిని శత్రువు లెవరైనా హాని చెయ్యాలని చూస్తున్నారేమోనని వాళ్ళ కోసం అరుచుకుంటూ వెళుతోంది. అది గమనించిన రాజా ఆనందంతో మురిసి పోయాడు. పూర్ రాజా అంతా నిజమను కొంటోంది. ఎంత మంచి కుక్క" ఎంత విశ్వాసంగల కుక్క. ఎంత గొప్పకుక్క. అమాంతంగా ఎత్తేసుకొని ముద్దులాడాడు ఒళ్లో పడుకోబెట్టుకొని దాని ఒంటిమీద ఇసక దులిపాడు. దాని చెవిలో వేలాడుతున్న కొఱుసుని తీసి నలిపి పారేస్తుంటే బాధగా జాకీ "కయ్‌క్క" మని అరిచింది. "ఫరవాలేదే" అని బుజ్జగిస్తూ ఒళ్ళంతా నిమురుతున్నాడు తల్లి ఒడిలో పిల్లాడిలాగ రాజా ఒడిలో ముడుచుకొని గారంచేస్తోంది. "షేక్‌హేండ్" యివ్వమన్నట్లు రాజా గుండెలమీదకాలుతో గీకుతోంది. రాజా "గుడ్! గుడ్!" అంటూ షేక్ హేండ్ చేస్తున్నాడు. మొహమంతా నాకేస్తూంది. దాని నాలుక గరుకుగా, ముక్కు నల్లగా గిలిగింతలు పెడుతోంటే మైమరచి పోతున్నాడు.

హఠాత్తుగా ఆ సమయంలో పార్టీలో ప్రెసిడెంటు జ్ఞాపకం వచ్చాడు. మీసాలలోనించి వాడినవ్వు తలుచుకుంటే రాజాకికోపంతో ముఖం ఎర్రబారింది. "ఏ బోయ్ రాజా! ఎక్కడ సంపాదించావ్ ఈసీమ కుక్కని—" ఎంత హేళనగా ఉంద. అందరిలోనూ తనని అవమానించాడు. పరాభవించాడు ఊరకుక్కని కదూ? అవును! నిజంగా తనది ఊరకుక్క. అయితే మాత్రం దానికేం తక్కువని. దానికి కూడా సీమ కుక్కలాగే నాలుగు కాళ్లూ ఒక నోరూ ఉంది. సీమ కుక్కకి రెండు నోర్లు ఉన్నాయా? ఎనిమిది కాళ్ళున్నాయా? దొరల దేశంలో కుక్కని ఈ దేశంలో సీమకుక్కంటారు. మరి తన జాకీని కూడా ఏ లండనులోనో పెడ్తే అక్కడ యిదికూడా సీమ

కుక్క కాదేమిటి? ఎప్పుడైనా వీలుపడితే తన జాకీని ఉస్కో పెట్టించి ప్రెసిడెంటుగార్ని కరిపించేద్దామనుకున్నాడు. అప్పుడు తెలి స్తుంది ఊరకుక్క తడాఖా. నాడి దగ్గర అల్షేషియన్ కుక్క ఉందని పొగరు. ఎవడక్కావాలి. అది అరుస్తే నూతిలోనుంచి అరు స్తున్నట్లుంది... పొడుగ్గా ఎప్పుడూ నాలిక బయటికి చాచుకొని ఒగురుస్తూంటుంది....ఛీ! అది దగ్గర కొస్తేనే గబ్బుకంపు. ఇంట్లో ఉన్నంతసేపు దాని డాబు బయటకొస్తే తోక ముడుచుకుంటుంది. అది అసలు కుక్కా అని? పెద్ద నక్కలా ఉంటుంది. అబ్బా!దాని క్కూడా ఎంత పొగరని! ఒకసారి కారులోనుంచి తన జాకి వైపు చూసి అరిచింది. అది పెద్దదని దాని డాబు ప్రెసిడెంటుగాడి కుక్క నని దాని పోజు. దాగి ఒంటినిండా కండలున్నాయని గర్వం. జాకీకికూడా మంచి తిండి పెడితే దాని బాబులాంటి కండలొస్తాయి. ఎటొచ్చి దానికి మంచి తిండి పెడతానంటే నాన్న ఒప్పుకోడు. నాన్న కూడా తన కుక్కని "ఊరకుక్క" అని చీదరించు కుంటుంటాడు. అయినా నాన్నకి తెలీకుండా అమ్మ దగ్గర డబ్బు లడిగి జాకీకి బ్రెడ్లు, కేకులు, బిస్కత్తులు, తినిపిస్తున్నాడు. రోజూ తను తీసుకుంటున్న టానిక్కు ఒక్కొక్క చెంచాడు పడుతున్నాడు. గాని కండలు పెరగడంలేదు. స్కూల్లో విల్సన్‌గాడు చెప్పాడు గొడ్డుమాంసం పెట్టలని ఎలాగైనా గొడ్డుమాంసం తినిపించాలి. జాకీకి కండలు పెరగాలి. అది పెద్దదవ్వాలి. గుర్రం అంత అవ్వాలి. అప్పుడు ప్రెసిడెంటుగాడి కుక్కతో పోట్లాటకి పట్టుకెళ్ళాలి. అసలు ప్రెసిడెంటుగాడి కుక్కని ఏదైనా లారి తొక్కేస్తే బాగుణ్ణు....

నాన్నకి కూడా జాకీఅంటే అయిష్టమే ఎందుకు చెప్మా? దాన్ని ఏదో నెపంతో బూటుకాళ్ళతో తంతాడు. దానిక్కూడా సబ్బు

రాసి స్నానం చేయిస్తే కస్సుమంటాడు. అది ఊరకుక్కట అది పెంటలమీద ఉండాల్సిందేగానీ గొప్పోళ్ళ ఇళ్ళల్లో ఉండటానికి అర్హత లేదంటాడు. మరి నాన్నగారంటే జాకీకి ఎంత ఇష్టమో! అతని కాళ్ళ మధ్యలో దూరి ఆడుకోబోతుంది. ఎగిరి గుండెలమీద ఆప్యాయంగా ఎగబ్రాకాలని చూస్తుంది. నాన్న సంతోషించడు. సరికదా కొట్టి కొట్టి చంపేసినంత పని చేస్తాడు. అయినా నాన్న అదోరకం మనిషి. పని మనుషులతోనూ, పేదవాళ్ళతోను సరిగ్గా మాట్లాడడు. వాళ్ళవైపు గొంగళిపురుగులను చూసినట్టు చూస్తాడు. మాటాడవలసొస్తే అమడ దూరాన్నుంచే మాట్లాడుతాడు. తన జాకీని చూసినట్లే వాళ్ళనీకూడా చూస్తాడు. జాకీలాగా వాళ్ళుకూడా నాన్న దృష్టిలో ఊరుమనుషులే నేమో? మరి అతను లండనులో పుట్టాడా? కాదు గదా! అలా అయితే అతనుకూడా "ఊరుమని" షే కదా! కారుల్లో వచ్చిన వాళ్ళని, సూటుల్లో వచ్చిన వాళ్ళని కౌగలించుకుంటాడు. మినిష్టరు వస్తే అతని వెంట కుక్కలాగ తిరుగుతాడు. జాకీ మాత్రం తనవెంట తిరగడానికి ఒప్పుకోడు.... ఏమిటో! తన తండ్రి మనస్తత్వం రాజా పసిహృదయానికి అంతు పట్టడం లేదు.

ఒకటి మాత్రం నిశ్చయించుకున్నాడు ఏది ఏమైనా జాకీని మాత్రం విడిచిపెట్టేది లేదు. అది తన ప్రాణం దానికింకా బ్రెడ్లు, బిస్కత్తులు, టానిక్కులు మేపాలి. గొడ్డుమాంసం పెట్టాలి. సర్కసులో కుక్కలాగ లెక్కలు చేయించాలి. పోలీసు కుక్కల్లాగ దొంగల్ని పసిగట్టే తర్ఫీదు ఇవ్వాలి. ఆఊళ్ళో ఉన్న జాతికుక్కల్తో పోట్లాడించి చిత్తుచెయ్యించాలి. ప్రత్యేకించి ప్రెసిడెంటుగాడి కుక్కతో మిసెస్ రాజారావు మీదకూడా కించిత్ కోపంఉంది. అది

కూడా ప్రెసిడెంటుగాడితో కలిసి నవ్వింది. గార వళ్ళది. దానికుక్క మహా పెద్దకుక్కలాగ. ఎప్పుడూ ఆడాళ్ళ అడ్డాల్లో పడుకొనే ఆడారి కుక్క. దానిని అసలు ఏ పిల్లయినా ఇట్టే చంపెయ్యగలదు, తన కుక్క దాకా ఎందుకూ?

ఒళ్ళో గారాంచేస్తున్న జాకీ లేచి ఒక్క కుదుపు కుదిపి రాజాని కదిలించుకొని భౌ భౌ మని పరుగెత్తింది. ఆ కుదుపుతో రాజా వెల్లికితలా పడిపోయాడు. నీటి ఒడ్డున కాకులు కావు కావు మనీ ఎగురుతున్నాయి. వాటిని పట్టుకునేందుకు జాకీ ఎగురుతూ భౌ భౌ మని అరుస్తోంది. వెంటాడుతోంది. వెల్లకితలా పడిపోయిన రాజా ఆ దృశ్యాన్ని చూస్తూ ఆనందంతో దొర్లుతూ "కేచ్ జాకీ కేచ్" అని అరిచాడు. కాకులు విసుగెత్తిపోయి దూరంగా తాటి చెట్లవైపు ఎగిరిపోయాయి. జాకీ డిస్పపాయింటింగ్‌గా ఒగరస్తూ, తన ఓటమికి సిగ్గుపడుతూ తోకాడించుకొని ఇసకలో పొర్లుతున్న రాజా దగ్గరికి వచ్చింది. "కమాన్! కమాన్! పిచ్చిముండా కాకులు దొరుకుతాయటె!" అని జాకీనిమీదికిలాగుకున్నాడు. జాకీకిమరీముద్దు ఎక్కువైపోయింది. బౌ బౌ మని రాజా మీదికి దూకుతూ బట్టల్ని నోటితో లాగుతూ విదిలించడం మొదలెట్టింది. రాజా ఉండుండి ఒక్కొక్క తోపు తోస్తున్నాడు. దభాలున వెనక్కి పడిపోతోంది. తిరిగి కలబడిపోతోంది రాజా దొర్లుతూ అటూ ఇటూ తప్పించు కుంటున్నాడు, కరవబోయేటట్లు నటిస్తూ కోపంగా మొరుగుతూ మీదికి వచ్చేది. రాజా శాంసన్‌లా ఎడమచెయ్యి దాని నోట్లో పెట్టి అదిచేస్తూ, కుడిచేత్తో పొట్టమీద డిస్కూ! డిస్కూ! మని ముద్దుగా గుద్దుతున్నాడు. ఒకళ్ళమీద ఒకళ్ళు పడి దొర్లుతున్నారు. అరుపులు, నవ్వులు కేకలతో మైమరచిపోతున్నారు. అలావట్టు పరువుల

మీద పెరిగిన రాజా, పెంటకుప్పల్లో పుట్టిన ఊరకుక్కని కౌగలించుకొని దొర్లుతుంటే ప్రేమకి, స్నేహానికి అంతస్తులతో నిమిత్తం లేదని అనిపించకమానదు.

సంజెచీకట్లు మెల్ల మెల్లగా అల్లుకుంటున్నాయి. యారాడ కొండ మీద డేంజర్ లైటు వెలిగింది, ఎర్రగా బ్లింకుతోంది. ఆకాశంమీద మేఘాలు మరింత చిక్కబడుతున్నాయి. సముద్రంలో కెరటాలు ఆకలిగొన్న రాక్షసుడిలా ఉధృతంగా లేస్తున్నాయి. భయంకరమైన తుఫానురావచ్చు. రంగారావు కోరిక ప్రకారం పూరిగుడిసెలు ఎగిరిపోనూవచ్చు, కుష్ఠురోగి తలదాచుకోడానికి చోటు దొరక్క చలిలో కొయ్యబారి చచ్చిపోనూవచ్చు—

చెలగాటంలో రాజా జేబులో దాచుకొన్న బంతి తుళ్ళిపోయి ఇసకలో పరుగెత్తింది. జాకీ దానిని వెంబడించి చిటికెలో నోట కరచుకొని తెచ్చి పడేసింది. "శభాష్!" అని వీపుమీద చరుస్తూ లేచి తిరిగి బంతి విసిరాడు. జాకీ దాన్ని గాలిలోనే పట్టుకోబోయి మిస్ అయిపోయింది. బంతి ఒడ్డున కొండరాయికి ఢీకొని తుప్పున ఎగిరి సముద్రంలో పడిపోయింది, బాణంలా సముద్రంలోకి దూకింది జాకీ. కెరటాల్లో మునకలేస్తూ బంతిని పట్టుకుంది తడిసి ముద్దయిపోయి ఒణుకుతూ బంతిని తెచ్చి రాజా పాదాల దగ్గర పడేసింది, "అయ్యో! అయ్యో! చలిలో ఒణికిపోతున్నావ్ ముండా పద పద పోదాం. చీకటి పడిపోతోంది." అంటూ బంతిని తీసి చేతిలో ఎగరేసుకుంటూ ముందుకు నడిచాడు రాజా, జాకీకి ఇంకా సరదా తీరలేదు సముద్రం నీటిలో తడిసి గజ గజ లాడిపోతున్నా ఇంకా సరదాగానే ఉంది. ఇంకా ఆడుకోవాలనే ఉంది, రాజా కాళ్ళకి అడ్డంపడుతూ కుంయ్ కుంయ్ మని మారాంచేస్తూ

ముందుకు నడవనీయకుండా అడ్డంవస్తోంది. గుండెల మీదికి ఎగ్రబాకుతూ ముందరి కాళ్ళతో రాజాని బకురుతోంది. "అబ్బా! నీకు బంతిని చూస్తే మతిపోతుంది. చీకటి పడిపోయింది. నిన్నూ నన్నూ కూడా నాన్న చీరేస్తాడు." అని సముదాయించడం మొదలెట్టాడు. జాకీపట్టు విడువలేదు. "మరి కాస్సేపు ఆడుకుందాం రాజా" అన్నట్లు దీనంగా రాజా కళ్ళల్లోకి చూసింది. అలా చూస్తుంటే రాజాకి కనికరం వేసింది. "సరే కానీ!" బంతిని సూటిగా సముద్రం లోకి విసిరాడు ఇలా బంతిని విసిరాడో లేదో అలా సముద్రంలోకి దభాలున దూకి బంతితో తిరిగి వచ్చేసింది.

"శభాష్! భలే రైట్" అంటూ చప్పట్లు చరిచాడు.

తిరిగి విసరబోతూ చేతికి గరుకుగా తగిలితే బంతిని పరీక్షగా చూశాడు. బంతిమీద కుక్క పంటిగాట్లు పడున్నాయి. వాటిలోనించి గాలి బుడగలు సుంయ్ సుంయ్‌మని ఊబుకుతూ చిట్లుతున్నాయి. తన కుక్క పంటిగాట్లు అంత గట్టిగా పడినందుకు ఉప్పొంగిపోయాడు. బంతిని నొక్కుతుంటే సర్ సర్ మని నీరు పిచ్చికారీ కొట్టినట్లు మొహంమీద తుళ్ళుతోంది. "ఏం పట్టురా బాబూ! రబ్బరు బంతి లాంటిదే కన్నాలు పడిపోయింది. రేపుపోట్లాటలో ప్రెసిడెంటు గాడి కుక్క ఏ మాత్రం? అమాంతంగా దాని తలకొరికి పారేస్తుంది జాకీ...కావాలి, అది చావాలి" ప్రెసిడెంటుగాడి కుక్క జ్ఞాపకం వచ్చేసరికల్లా అంతవరకు అణగారినకోపం, క్రోధం ఒక్క వూపున సముద్రంలోని కెరటాల్లా వెర్రితలలెత్తాయి. రక్తం మరిగిపోతోంది. పట్టరాని ఆవేశంలో పళ్ళు బిగబట్టి చేతిలో బంతిని అప్రయత్నంగా కసిగా పిసికాడు. రంయ్‌మని నీరు ముఖాన్ని చిమ్మింది.

"ఇలానే దాని నెత్తురు చిమ్మాలి. నెత్తురు మడుగులో గిల గిల తన్నుకు చావాలి" అంటూ నోటిమీదికి జారుతున్న ఉప్పు నీటిని నాలికతో చప్పరిస్తూ కసిగా తిరిగి బంతిని సముద్రంలోకి విసిరాడు.

"కాచ్ జాకీ! కాచ్!"

జాకీ తెచ్చేసింది.

"గుడ్! గుడ్! వన్స్‌మోర్! కేచ్" అంటూ రెట్టింపు జోరులో విసిరాడు.

మరింత స్పీడుగా తెచ్చింది.

కసితో, కోపంతో, క్రోధంతో, ఈర్ష్యతో ఊగిసలాడిపోతూ, ఒళ్ళు మరచిపోయి బంతిని సముద్రంలోకి విసురుతునే వున్నాడు. జాకీ తెస్తూనే వుంది. ఇద్దరూ అలిసిపోయి ఒగురుస్తున్నారు.

చీకటి ఎక్కువౌతోంది. కెరటాలు మసగ చీకటిలో మరింత భయంకరంగా కనిపిస్తున్నాయి. కొండ మీద డేంజరు లైటు మరింత ఎర్రగా కనిపిస్తోంది. రాజా జాకీ తెల్ల తెల్లటి ఇసక మీద నల్లటి నీడల్లా పరుగెత్తుతున్నాడు.

రాజా బలంపూర్తిగా బంతిని విసిరాడు. గాలిలా వెంబడించింది జాకీ.

రివ్వున నల్లటి సముద్రం నీటిలోకి చొచ్చుకు పోయిన బంతి మసక చీకటిలో జాకీకి కనిపించలేదు. హఠాత్తుగా ఆగిపోయింది. బంతి ఎటుపోయిందో తెలియక తటపటాయిస్తూ నీటి అంచులు దగ్గర వెతుకుతోంది. జాకీ గ్రేడ్ తినేసింది. బంతి తేలేక పోయింది. ఓడిపోయింది.

"షేమ్! షేమ్! బంతిని తేలేకపోయావ్ షేమ్.... షేమ్"
అంటూ కేరింతలు కొడుతూ గెంతుతున్నాడు రాజా.

బంతి జాడ తెలియని జాకీ కుంయ్ కుంయ్‌మని అరుస్తూ
చిరాగ్గా కాళ్ళతో బురదని తవ్వేస్తోంది.

"షేమ్! షేమ్! వాట్ జాకీ, రేపు ప్రెసిడెంటుగాడి కుక్కతో
పోట్లాటలో ఇలాగే డిఫీటయిపోతావా ఏమిటి? ఊ!— క్విక్!—
షేమ్!— షేమ్" అని అరుస్తూ ఎగతాళిగా కవ్విస్తున్నాడు.

జాకీ నిజంగానే షేమ్ ఫీలయ్యింది. అది విడిచి
పెడ్తుందా?— సప్త సముద్రాల్లో ఎక్కడ దాక్కొని ఉన్నా బంతిని
లాక్కొని రాదూ! రెండడుగులు వెనక్కి వేసింది. బలాన్ని
యావత్తూ కేంద్రీకరించుకొని గబాలున నీటిలోకి డైవ్ చేసింది.

"షేమ్! షేమ్—షేమ్—" అంటూ ఇంకా గెంతుతున్నాడు
రాజా.

పెద్ద కెరటం ఏనుగెత్తు ప్రమాణంలో లేచి భళ్ళున సుడులు
తిరుగుతూ తిరిగి పోయింది.

"కంయ్—కంయ్" రెండే అరుపులు. అవి జాకీ అరుపులు.

అవి అరుపులు కావు. ఆక్రందనలు — ఎడారి మధ్యలోనో,
నడి సముద్రంలోనో నిస్సహాయంగా అరిచినట్లున్నాయి.

నవ్వుతున్న రాజా హఠాత్తుగా గతుక్కుమని
ఆగిపోయాడు.

ఒడ్డున విరిగిన కెరటం జంయ్‌మని పెద్ద చప్పుడు చేసు
కుంటూ వెనక్కి తన పని అయిపోయినట్లుగా వెళ్ళిపోయింది.

రాజా మతిపోయినవాడిలా నీటి ఒడ్డుకి పరుగెత్తాడు, 'జాకీ
అని పిలిచాడు.

"కమాన్ జాకీ! కమాన్!.... జాకీ.... కమాన్.... జాకీ" అని అరుస్తున్నాడు. ఆ పిలుపులు అనుమానంగా వున్నాయి. పిలుపు విని పరుగెత్తుకొని వచ్చినట్లు బంతి సంయ్‌మని సముద్రంలోనించి కొట్టు కొచ్చి రాజా పాదాలకి రంయ్‌మని రాసుకుంటూ పోయింది.

జాకీ మాత్రం రాలేదు.

"జాకీ.... జాకీ.... వెళిపోదాంరా జాకీ — చీకటి పడిపోతోంది" అని పిలుస్తున్నాడు గొంతుకు రుద్ధమౌతోంది.

జాకీ రావటం లేదు.

కెరటాలు వస్తున్నాయి. తిరిగిపోతూన్నాయి. వాటి నురగలు మెత్తని ఇసకలో సుంయ్ సుంయ్ మని ఇంకిపోతున్నాయి.

ఎంత పిలిచినా జాకీ లేదు.

అర్థమయింది ఆ పెద్ద కెరటం జాకీని మింగేసింది.

వసి హృదయం ముక్కలు ముక్కలుగా వగిలిపోయింది. క్షణం క్రితం తను కనిన కలలు చెదిరిపోయాయి. తను నిర్మించుకున్న లక్ష్యాల గృహం కాలిపోయింది.

పిచ్చిగా అటూ యిటూ పరుగెత్తుతున్నాడు. దొర్లి దొర్లి ఏడుస్తున్నాడు. జుత్తు పీకుంటున్నాడు.

"జాకీ! జాకీ జాకీ రా జాకీ పోదాం."

రాజా వెక్కి వెక్కి ఏడుస్తుంటే, నిర్జన శ్మశానంలో బిడ్డ శవం మీద పడి ఏడుస్తున్న తల్లి ఆక్రందనలా ఉంది.

ఏడుగంటలు కావస్తున్నా ఇంటికి తిరిగి రాని రాజా కోసం ఇంట్లో ఆందోళన పడిపోతున్నారు. సముద్రాన్నీ, చీకటినీ తలచుకుంటుంటే సరోజకి అనుమానం ఎక్కువౌసాగింది. ఆట్లాడుకుంటూ నీళ్ళలోకి దిగాడేమో! "అయ్యో!" అనికుంది. కొడుకుని వెంటనే

తీసుకు రమ్మనమని నౌకర్లని పంపించింది. వాళ్ళతోపాటు రంగారావు కూడా బయలుదేరాడు. సరోజ ఏడుపు లంకించుకుంది.

"ఎందుకు ఏడుపు ఏమయిందని ఆ పాడు ఊర కుక్కతో ఆట్లాడుకుంటూ కూచోనుంటాడు, ఏది ఏమైనాసరే రేపు ఆ కుక్కని కాల్చిపారేస్తాను." అంటూ కోపంలో తలకి మఫ్లర్ చుట్టుకొంటూ చేతిలో బేటరీలైటు తీసుకొని బయలుదేరాడు.

లైటు వేసుకుంటూ నీలో వెలుతున్నాడు. ఎక్కడా రాజా కనిపించటంలేదు. రంగారావు కూడా ఆందోళన పడసాగాడు. నౌకర్లు "రాజాబాబూ! రాజాబాబూ!" అని అన్నివైపులా పరుగెత్తుకుంటూ పిలుస్తున్నారు రాజా అలికిడి ఎక్కడాలేదు. అలా వెతుకుతుంటే కొద్దిదూరంలో రాజా బంతి కనిపించింది లైటులో. రాజా మాత్రం చుట్టుప్రక్కలా ఎక్కడా కనిపించటంలేదు. బంతిని చూడగానే రంగారావు మరింత గాబరా పడిపోయాడు. పిచ్చిగా నౌకర్లను కేకలేస్తున్నాడు. "మొద్దు సన్నాసుల్లారా, అన్నివైపులా సరిగ్గా వెతకండిరా" అని కసురుతున్నాడు.

అంతకంతకి రంగారావుకి అనుమానం ఎక్కువవుతుంది.

"రాజా,రాజా" అని పిలుస్తూ పరుగెత్తడం మొదలు పెట్టాడు, చెమట్లు కక్కుకుంటున్నాడు. మాటి మాటికి సముద్రం మీద లైటు వేస్తున్నాడు.

"రాజా—రాజా—రాజా...."

............

సముద్ర ఘోష తప్పించి అంతా నిశ్శబ్దం.

————

14)

సముద్ర పొడ్డున కనిపించిన ప్రతీ రాయిని చూసి రాజా ఏమోనని గతుక్కుమని అనుమానంగా ఆగిపోతూ వాటిమీద పదే పదే లైటువేసి చూస్తున్నాడు—గుండెలు దడదడ కొట్టుకుంటు న్నాయి.

లైటు హౌసు కాంతి ఉండండి సముద్రం మీద చీకటిని చీల్చుకొని పరుగెత్తుతోంది.

———

హఠాత్తుగా దూరంగా "జాకీ" అనే సన్నని కేక విని పించింది. హోరుగాలి శబ్దంలో కలసిపోతున్న కేక లెక్కడో దూరంగా కొండ లోయల్లోంచి వినవస్తున్నట్టుంది.

———

"జాకీ"

అవును రాజా గొంతే! మామయ్యా!

"రాజా—రాజా— ఇక్కడున్నాను. ఇలారా" అని మరింత బిగ్గరంగా అరిచాడు మనస్సు తేలికపడింది కొడుకు దొరికి పోయాడు ...

రాజాకి మాత్రం జాకీ దొరకలేదు.

"జాకీ! జాకీ— జాకీ" అరుపులు దగ్గరౌతున్నాయి. రాజా ఏడుస్తున్నట్లు ఆ అరుపులో స్పష్టం - తెలుస్తోంది.

"జాకీ—జాకీ—కమాన్ జాకీ—కమాన్—జాకీ."

"రాజా— రాజా— రాజా— ఇదిగో ఇక్కడా---లైటు" అంటూ రంగారావు కొడుక్కి ఎదురుగా పరుగెత్తుకు వెళుతున్నాడు. సముద్రం వైపు చేతులు చాచుకుంటూ ఏడుస్తూ, జాకీని పిలుస్తూ తూలిపోతూ అటునుంచి పరిగెత్తుకొని వస్తున్నాడు రాజా.

తండ్రీ కొడుకుల అరుపులు ఆ నిర్జన సముద్ర తీరంలో ఖంగు ఖంగు మంటున్నాయి.

రాజాని చూడగానే రంగారావు చచ్చిపోయిన కొడుకు బతికి వచ్చినట్టుగా సంబరపడిపోతూ ఉక్కిరి బిక్కిరయిపోతూ "రాజా! రాజా! అని కొడుకుని పరుగెత్తుకెళ్ళి కౌగలించుకున్నాడు తండ్రిని చూడగానే రాజా ఒక్కసారి బావురుమన్నాడు. ఏదో చెప్పబోయాడు. మాట సరిగ్గా పలకటంలేదు. ఏడుపులో కలిసి పోతోంది. "నాన్నా----నాన్నా----జాకీని-. కెరటం---కెరటం మింగేసింది." అని అనగలిగాడు. చేతులు కాళ్ళూ నేల మీద హిస్టిరిక్‌గా కొట్టుకుంటూ ఏడుస్తున్నాడు. గుప్పెళ్ళలో ఇసక తీస్తూ సముద్రం వైపు కోపంగా విసురుతున్నాడు. రాజాని ఓదార్చలేక పోతున్నారు. కన్నీరు మున్నీరుగా ఏడుస్తున్నాడు. బలవంతాన పట్టుకొనినము దాయిస్తు నడిపిస్తుంటే గింజుకుంటూ విదిలించుకొని సముద్రం వైపు పరుగెత్తుతున్నాడు. ఏలాగయితేనేం అతి కష్టం మీద ఇంటికి చేర్చారు.

కుక్కతో ఆటకి వెళ్ళిన రాజా ఒంటరిగా యింటికి తిరిగొచ్చాడు.

తమ ఏవగించుకుంటున్న ఊరకుక్క చచ్చిపోయింది. పెద్ద భారం నెత్తిమీద నుంచి దిగినట్లు తేలికగా ఫీలయ్యాడు రంగారావు. పోనీ! మన ప్రమేయం లేకుండా దానంతట అదే చచ్చింది ఈసారి తన కొడుక్కి మంచి జాతికుక్కని— కనీసం అల్సేషియన్‌ని కొని పెట్టాలని అనుకుంటూ పుత్రాన్వేషణలో అలిసిపోయిన తన శరీరాన్ని మనస్సుని మరి రెండు ఎక్‌స్ట్రా పెగ్గుల విస్కీతో జోకొట్టి పడుకోబెట్టేశాడు.

ఆ రాత్రి జ్వర తీవ్రతలో రాజా సముద్రాన్ని, కెరటాల్ని, ప్రెసిడెంటునీ, వాడి కుక్కనీ బూతులు తిట్టాడు.

*　　　*　　　*

మరుసటి రోజు—

బాగా ప్రొద్దెక్కింది. ఎండ కాస్తోంది. ఆకాశం నిర్మలంగా వుంది. మేఘాలు లేవు. జ్వరంలో లేచి తూలుకుంటూ కిటికీలోంచి సముద్రంవైపు చూశాడు రాజా. సముద్రం మామూలుగా వుంది. నిన్నటిలాగ నల్లగా లేదు. నీలంగావుంది. సూర్యకిరణాలు ప్రతిఫలిస్తున్నాయి, తన జాకీని పొట్టన బెట్టుకున్న సముద్రం ఏమీ తెలియని నంగనాచిలా అనిపించింది. సముద్రంమీద పట్టరాని కోపం వచ్చింది. ఉన్నివళంగా ఇంకిపోతే బాగుండుననిపించింది.

నిన్నటి సంఘటన తలుచుకుంటుంటే తెరలు తెరలుగా దుఃఖం క్రమ్ముకొచ్చింది ఆఖరిసారిగా "కంయ్....కంయ్" మని అరిచింది. పాపం ఎంత బాధ పడిందో—కళ్ళ వెంట నీరు జల జల రాలింది. ఆ అరుపులో "చిన్న బాబూ! నేను వెళ్ళిపోతున్నాను. నేను ఊరకుక్కని, నా కోసం మీరు నాన్నగారితో తిట్లు తినకండి. సేవ్" అనే భావన రాజా పసి హృదయంలో మెదిలింది.

చేత్తో ముఖం కప్పుకుని వెక్కి వెక్కి ఏడ్చాడు.

రంగారావు ఓదారుస్తూ "ఊరుకో రాజా, పోతే పోయింది. ఊరకుక్క, దాని కోసం ఇంతగా ఇదయిపోవాలా?....ఈసారి మంచి జాతి కుక్కని బెంగుళూరు నించి తెప్పిస్తానులే. పెంచుకుందాం" అన్నాడు.

ఈ మాట వినేసరికి రాజా త్రాచుపాములా లేచాడు. "నాకొద్దు....నాకు జాతికుక్కొద్దు....నాకు జాకీయే కావాలి....దాన్ని

మీరంతా కలిసి చంపేశారు. నువ్వు పెంచిందెందుకు. వాడిజాతి కుక్క- మీరు అందరూ....మీరు....మీరు....మీరు...." అంటూ ఒళ్ళు తెలియని కోపంతో. పళ్ళు బిగబట్టి. పిడికిలి బిగించుకుంటూ దెయ్యం పట్టినట్లు ఊగిపోతూ చేతికందిన ఫ్లవర్ వాజ్‌తో గోడకి అమర్చిన అద్దాన్ని పగలగొట్టేశాడు. అది బళ్ళున పగిలిపోయి ముక్కముక్కలై గదంతా తుళ్ళిపోయింది.

ముందుగా తను తేరుకొని, తనకున్నంత అహం తన కొడుక్కి వుంది. ఫరవాలేదు పెద్దయితే తన పేరు నిలబెట్టగలడనుకుంటూ బయటకు వచ్చేశాడు మిస్టర్ రంగారావు.

సముద్రపొడ్డున ఎక్కడో కొట్టుకొచ్చిన కుక్క శవాన్ని పీక్కు తినడానికి రాబందులు గుంపులు గుంపులుగా దిగుతున్నాయి.